ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి


జిల్లా వార్తలు

5★ గురువారం 28 మార్చి 2024

రౌడీషీటర్లు క్రైమ్ స్టాపర్లుగా పనిచేయాలి : సీపీ

ఓబీ కంపెనీపై ప్రభావిత గ్రామాల ప్రజల ఆగ్రహం

8లో..



కాల్వశ్రీరాంపూర్ మండలంలో పొలంలో ఇసుక మేటలు(ఫైల్)



నష్టపరిహారం అందేదెన్నడు?

- ఎకరానికి రూ.10వేలు ఇస్తామని అప్పటి సీఎం ప్రకటన
- గత మార్చిలో దెబ్బతిన్న పంటలకే పరిహారం మంజూరు
- అంతకుముందు, తర్వాత దెబ్బతిన్న పంటలకు అందని వైనం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో కురిసిన వడగళ్లు, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇప్పటికీ అందలేదు. దీంతో ఆ సొమ్మును ఎప్పుడు విడుదల చేస్తారా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కేవలం కొందరు రైతులకు మాత్రమే అప్పటి ప్రభుత్వం పరిహారాన్ని అందించి చేతులు దులుపుకోగా, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తుందని ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతూనే ఉన్నారు. దెబ్బతిన్న పంటలను ప్రజాప్రతినిధులు పరిశీలించి పరిహారం అందేలా చూస్తామని ఇస్తున్న హామీలు కంటితుడుపు చర్యలుగానే మారుతున్నాయి. గత ఏడాది యాసంగి సీజన్‌లో కురిసిన వడగళ్ల వర్షాలు, అకాల వర్షాలతో పెద్దఎత్తున పంటలకు నష్టం వాటిల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మార్చి 15 నుంచి 20 వరకు కురిసిన వర్షాల వల్ల జిల్లాలో 6910 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలను 5790 మంది రైతులు కోల్పోయారు. అదే సమయంలో వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో పంటలు నష్టపోవడంతో వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పంటలను పరిశీలించిన మాజీ సీఎం కేసీఆర్ ఎకరానికి 10వేల రూపాయల నష్టపరిహారం ప్రకటించారు. ఆ మేరకు 6910 ఎకరాల్లో పంటలు కోల్పోయిన రైతులకు 69 కోట్ల 10 లక్షల రూపాయల పరిహారాన్ని అప్పటి ప్రభుత్వం మంజూరుచేసింది.

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతులు..

గత ఏడాది ఏప్రిల్‌లో మూడు పర్యాయాలుగా కురిసిన వర్షాలకు 21,948 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయలు, ఇతర పంటలను 15,570మంది రైతులు నష్టపోయారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో జూలైలో పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ నిధులను మాత్రం విడుదల చేయలేదు. అంతకుముందు 2019 అక్టోబరు 17 నుంచి నవంబరు 2 వరకు కురిసిన భారీ వర్షాల వల్ల 20,108 ఎకరాల్లో వరి, 467 ఎకరాల్లో పత్తి, 24 ఎకరాల్లో మొక్కజొన్న, 20 ఎకరాల్లో మిర్చి పంటలను 16,068 మంది రైతులు పంటను కోల్పోయారు. 2020 సెప్టెంబరు 17న కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టుల బ్యాక్ వాటర్, చెక్ డ్యామ్‌ల లీకేజీ వల్ల 24 ఎకరాల వరి పంటను రైతులు కోల్పోయారు. 2021 ఆగస్టు 31న కురిసిన భారీ వర్షాల వల్ల 32 ఎకరాల వరి పంటను 14మంది రైతులు నష్టపోయారు. గత ఏడాది జనవరి 14న కురిసిన వడగళ్ల వానల వల్ల 162 ఎకరాల్లో మొక్కజొన్న పంటను 178మంది రైతులు, 6 ఎకరాల్లో బబ్బెర పంటను ముగ్గురు రైతులు పంట నష్టపోయారు. అదే ఏడాది జూలై 9 నుంచి 14 వరకు కురిసిన భారీ వర్షాలకు 184 ఎకరాల్లో వరి పంటను 77 మంది రైతులు, 2750 ఎకరాల్లో 1977 మంది రైతులు పత్తి పంట నష్టపోయారు. వీటికి సంబంధించి రైతులకు 13 కోట్ల రూపాయలకు పైగా పరిహారం రైతులకు చెల్లించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం పరిహారం అందించలేదు. కనీసం పంటల బీమా పథకం అయినా తమను ఆదుకుంటుందని రైతులు భావించినప్పటికీ, 2019 తర్వాత నుంచి ఆ పథకాన్ని అమలు చేయలేదు. గడిచిన ఐదేళ్లలో రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల పెద్ద ఎత్తున పంటలను కోల్పోవాల్సి వచ్చింది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల తమకు తీరని నష్టం వాటిల్లిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి గత ఏడాది, అంతకుముందు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని విడుదల చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమ్మర్ క్యాంప్‌ల ద్వారా విద్యార్థులకు గైడెన్స్ ఇవ్వాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 27 : సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులకు సరైన గైడెన్స్ అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమ్మర్ క్యాంప్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే వేసవి సెలవులలో జిల్లాలోని 100 గ్రామాలలో 3 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థుల కోసం తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ కలెక్టివ్ ఆధ్వర్యంలో భారత్ దేఖో టీమ్ ద్వారా ప్రత్యేక సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 11 వరకు సమ్మర్ క్యాంప్ ఉంటుందని అన్నారు. సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకుని వలంటీర్లు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగే విధంగా గైడెన్స్ ఇవ్వాలని అన్నారు. సమ్మర్ క్యాంపులో అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పిల్లలపై మంచి ప్రభావం పడే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు గొప్ప లక్ష్యాలను ఏర్పరచుకోవడం ఎలాగో నేర్పాలని, సమ్మర్ క్యాంపు ఉల్లాసవంతంగా నిర్వహిస్తూ జీవితానికి అవసరమైన ముఖ్య పాఠాలను సైతం బోధించాలని కలెక్టర్ తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనే విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటీర్లకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు క్రీడలు, నీతి కథలు చెప్పడం, చదువు ప్రాముఖ్యత వివరించడం, విలువలు, మోరల్స్ బోధించాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం వలంటీర్లు చేస్తున్న బాధ్యత చాలా గొప్పదని, సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులకు మంచి అంశాలను నేర్పాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సమ్మర్ క్యాంపులో రిజిస్టర్ చేసుకునే విధంగా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు సమన్వయం చేయాలని కలెక్టర్ సూచించారు. 63 మంది వలంటీర్లకు సమ్మర్ క్యాంప్ నిర్వహణ పట్ల శిక్షణ అందించామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ అధికారి డాక్టర్ పీఎం షేక్, భారత్ దేఖో టీమ్ సభ్యులు, ఎం.ఈ.ఓలు, టీచర్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.25వేలు పరిహారం ఇవ్వాలి

- 30న రైతులతో నిరసన దీక్ష - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చేతకానితనం వల్లనే జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోలేదని తెలిపారు. పంట విస్తీర్ణం పెరగడంతో పాటు పంట దిగుబడులు పెరిగి రైతులు మంచిగా జీవించారన్నారు. ప్రస్తుతం సాగునీరందక ఎండిపోతున్న పంటలను చూడలేక రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, రాష్ట్రంలో అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి కడు దయనీయంగా మారిందన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎండుతున్న పంటలను పరిశీలించామన్నారు. జిల్లాలో వెయ్యి ఎకరాలకు పైగా వరి, మిర్చి పంటలు ఎండిపోయాయని తెలిపారు. ఎండిపోయిన పంటలకు ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, ఉన్న పంటలకు సరిపడా సాగు నీరందించి ఎండిపోకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 30వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకు పెద్దపల్లిలో నిరసన దీక్ష చేపడతామని, ఈ దీక్షకు రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, పార్టీ నాయకులు రఘువీర్ సింగ్, ఉప్పు రాజు కుమార్, కౌన్సిలర్ పెంచాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి గ్రామపంచాయతీ కార్మికుల నిరసన

పెద్దపల్లిటౌన్, మార్చి 27: గ్రామపంచాయతీ కార్మికులు ఈనెల 30 నుంచి నిరసనకు దిగనున్నట్లు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కనీస వేతనం అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ అమలుచేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎండవేడిమి దృష్ట్యా ఏప్రిల్ ఒకటి నుంచి ఒకపూట పని చేయించాలని తదితర డిమాండ్లతో ఈనెల 30 నుంచి అన్ని మండలకేంద్రాల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నాలు, ఏప్రిల్ 1 నుంచి 3 వరకు డిమాండ్స్ బ్యాడ్జిస్ పెట్టుకుని విధులు నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేయాలన్నారు. ఏప్రిల్ 5 నుంచి 14 వరకు సామాజిక ఉద్యమకారుల జయంతి, వర్ధంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు సామాజిక సమస్యలు, పరిష్కార మార్గాలు అనే అంశంపై మండలాల్లో సదస్సులు, సెమినార్లు నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ ఆందోళన, పోరాట కార్యక్రమాల్లో జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి, ఖాజా, వివిధ మండలాల నాయకులు నాగయ్య, ఇరుగురాళ్ల లచ్చయ్య, శ్రీనివాస్, వెంకటేష్, పరశురాములు, ఆకుల రాజయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- త్వరలో ఇరిగేషన్ మంత్రి పర్యటన - ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



నంది రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మార్చి 27: ధర్మపురి నియోజకవర్గ ప్రాంతంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్టు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. బుధవారం మండలంలోని నందిమేడారంలోగల నంది రిజర్వాయర్‌లో నీటిమట్టాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రాంత రైతులకు సాగునీరు అందించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వివరించినట్టు తెలిపారు. ఈమేరకు పాలకుర్తి మండలం వేమునూర్ పంప్‌హౌస్ ద్వారా నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని సీఎం ఇరిగేషన్ అధికారులను ఆదేశించారని ఆయన వివరించారు. ఈ ప్రాంతానికి సాగునీటిని అందించేలా శాశ్వత పరిష్కారం చూపించేందుకు త్వరలోనే ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటిస్తారని ఆయన చెప్పారు. గత ప్రభుత్వహయాంలో పంప్‌హౌస్ మోటార్లు చెడిపోయినా మరమ్మతులు చేయించలేదని ఆయన ఆరోపించారు. 2016లో స్వయంగా అప్పటి సీఎం ధర్మారం మండలం పత్తిపాకలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి వెల్గటూర్, ధర్మారం మండలాలకు సాగునీటిని అందిస్తామని ప్రకటించి తర్వాత మాట మార్చారని ఆయన దుయ్యబట్టారు. అయినసప్పటికీ ఈప్రాంత రైతులకు సాగునీటిని అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని చెప్పారు. రైతులు ఆందోళనకు గురికావద్దని కోరారు. వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు చింతల జగన్‌మోహన్‌రెడ్డి, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, దేవి జనార్ధన్, కాడే సూర్యానారాయణ, పాలకుర్తి రాజేశం, కొత్త నర్సింహం, చిప్ప మణిశర్మ, లింగయ్య తదితరులు ఉన్నారు.

రామగుండంలో రోడ్ల విస్తరణకు ముందడుగు

- కమిషనర్ ఆదేశాలతో స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు



రాజీవ్ రహదారి పక్కన ఆక్రమణలను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, మార్చి 27: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల విస్తరణకు ముందడుగు పడుతోంది. గోదావరిఖని ప్రాంతంలో వ్యాపార కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించుకోగా, ఇందుకు అనుగుణంగా చర్యలు మొదలు పెట్టారు. మొదటగా ప్రస్తుత రోడ్ల ఆక్రమణలను తొలగిస్తున్నారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాలతో నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రస్తుతం ఉన్న రహదారుల ఆక్రమణలపై వ్యాపారులతో చర్చిస్తున్నారు. దీనిలో భాగంగా చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్, రీగల్ షూమార్ట్ నుంచి ఓల్డ్ అశోక థియేటర్ మీదుగా అశోక్‌నగర్ వరకు రోడ్లపైకి వచ్చిన నిర్మాణాలను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. ముఖ్యంగా మెయిన్ చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్ వరకు కొందరు వ్యాపారులు పది అడుగుల మేర రోడ్డుపై నిర్మాణాలు జరిపారు. వీటిని తొలగిస్తున్నారు.

సర్వీస్ రోడ్డు విస్తరణకు చర్యలు

గోదావరిఖని నుంచి ఎన్‌టీపీసీ వరకు రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా ఉన్న సైన్ బోర్డులు, హోర్డింగ్‌లు, ఆక్రమణలను బుధవారం నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. కమిషనర్ శ్రీకాంత్, ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రొక్లైన్‌లతో ప్రశాంత్‌నగర్, శ్రీనగర్ కాలనీల్లోని ఆక్రమణలను తొలగించారు.

క్వార్టర్లను కూల్చివేయడం సరైంది కాదు..

- కార్మిక సంఘం నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 27: రామగుండంలో అభివృద్ధి పేరిట క్వార్టర్లు కూల్చివేయడం సరైంది కాదని కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజారెడ్డి, ఆకుల హరీష్, ఐ కృష్ణ, ఈ నరేష్, తోట వేణు అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు ఇరువైపులా క్వార్టర్లు తొలగించకుండా ఒకవైపే తొలగించడం సరైంది కాదని, ఆర్‌జీ-1 జీఎం కార్మికులను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరింది కాదన్నారు. కొంత మంది వ్యాపారులు షటర్లు పొందాలనే రాజకీయ కక్ష చేస్తున్నారని, క్వార్టర్లను కూల్చివేసే నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో తోట అనసూర్య, దేవయ్య, రామస్వామి, రాజు, కనకమ్మ, సరిత ఉన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- మంథని ఆర్డీవో హనుమా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

రామగిరి, మార్చి 27: రానున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని మంథని ఆర్డీవో హనుమానాయక్ తెలిపారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో బుధవారం గోదావరిఖని, కాటారం, మంథని నియోజకవర్గ స్థాయి పోలీసులు, ఎలక్షన్ టీం, సెక్టార్, మాడల్‌కోడ్, నోడల్, తహసీల్దార్‌లు వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో హనుమానాయక్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ జారీ చేసిందని, పెద్దపల్లి పార్లమెంట్‌కు జరిగే ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ 18 నుంచి 24వ వరకు కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి నామినేషన్స్ స్వీకరణ ఉంటుందన్నారు. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉంటుందని, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు, మంథని నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చుల వివరాల పర్యవేక్షణకు జిల్లా ఎన్నికలఅధికారి పర్యవేక్షణలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పర్యవేక్షణకు 3స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, వీడియో వీవింగ్ టీంలు, వీడియో సర్విలన్స్‌టీంలు, మండలానికి ఒక మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆఫీసర్‌ను, పోలింగ్‌స్టేషన్ల పర్యవేక్షణకు 37 సెక్టార్ ఆఫీసర్లను నియమించారన్నారు. మంథని నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు2,39,108మంది, అందులో పురుషులు 1,17,271, మహిళలు 1,21,820 మంది, ట్రాన్స్ జెండర్‌లు 17 మంది ఓటర్లుగా నమోదు అయినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఈ-సేవా కేంద్రాన్ని ప్రారంభించిన జడ్జి



ఈ–సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిటౌన్, మార్చి 27: జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ సేవా కేంద్రాన్ని బుధవారం సీనియర్ సివిల్ జడ్జి హేమంత్ కుమార్ ప్రారంభించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 32 ఈ-సేవా కేంద్రాలను సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాలను సీజేఐ చంద్రచూడ్ వర్చువల్‌గా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సేవా కేంద్రాల పనితీరు, ప్రయోజనాలను ఆయన గురించి వివరించారు. ఈ కేంద్రం ద్వారా ప్రతి ఒక్కరికి సేవలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు అర్జున్, రాణిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాల నివారణకు పటిష్ట చర్యలు

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ

పెద్దపల్లిటౌన్, మార్చి 27: మాతృ మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. 2023లో జిల్లాలో ఆరుగురు మాతృమూర్తులు మరణించారని, దీనికి గల కారణాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి, రామగుండంలో వైద్య కళాశాల, వైద్య రంగంలో ప్రభుత్వపరంగా నూతన వైద్యుల నియామకం, సౌకర్యాలు కల్పించినప్పటికీ ఆరుగురు మహిళలు చనిపోవడానికి గల కారణాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన పొరపాట్లు, భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, సెన్సిటివ్ కేసులను గుర్తించి అవసరమైన వైద్య చికిత్స అందించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గర్భిణుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని, క్రిటికల్ కేసులను గుర్తించి ప్రత్యేక వైద్య చికిత్స అందించాలని, గర్భిణులను క్షేత్ర స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఫాలోఅప్ చేయాలని, రెగ్యులర్‌గా మందుల వాడకం, పౌష్టికాహారం తీసుకోవడం వంటివి పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గర్భిణులకు ఎర్లీ రిజిస్ట్రేషన్ చేయాలని, మొదటి, రెండవ, త్రై మాసంలో వైద్య అధికారితో, మూడు, నాల్గవ త్రైమాసంలో పరీక్ష చెయ్యాలన్నారు. గుండె జబ్బులాంటి వ్యాధులు ఉన్నట్టు అనుమానం కలిగితే సంబంధిత నిపుణలతో పరీక్ష చెయ్యాలని అన్నారు. ఆశాలు, ఏఎన్ఎంలు అందరు గర్భిణులను సమన్వయం చేసుకొని వారికి తోడుగా ప్రసూతి కేంద్రంకు వెళ్లాలని, మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో కే.నరేందర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కృపాబాయి, డాక్టర్ వాణిశ్రీ, గైనకాలాజిస్టులు డాక్టర్ అరుణ, డాక్టర్ రమాదేవి, డాక్టర్ స్రవంతి, ప్రైవేటు గైనిక్ వైద్యులు డాక్టర్ విజయ, పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి 27: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పుట్ట ధర్మయ్య(38) అనే పశువుల కాపరి తేనెటీగల దాడిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన పుట్ట ధర్మయ్య బుధవారం పశువులను మేపుకుంటూ గ్రామ శివారులోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా మెట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ధర్మయ్య మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాలీ ఆటోను అపహరించిన వ్యక్తిని పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో ఓ ట్రాలీ ఆటోను అపహరించి అనుమానాస్పదంగా కనిపించిన గుర్తు తెలియని వ్యక్తిని బుధవారం రాత్రి స్థానికులు పట్టుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సిరిసిల్ల గోపాల్‌నగర్ ప్రాంతంలో నిలిపి ఉంచిన బండారి లక్ష్మణ్‌కు చెందిన ట్రాలీ ఆటోను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. తన వాహనం కనిపించకపోవడంతో ఆందోళన చెందిన వాహన యజమాని లక్ష్మణ్ చుట్టు పక్క గ్రామాల ఆటో డ్రైవర్లకు సమాచారం అందించాడు. వెంకటాపూర్ గ్రామ శివారులో అనుమానస్పదంగా ట్రాలీ ఆటోతో ఓ వ్యక్తి కనిపించాడు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో స్థానికులు అతన్ని తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 27: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ఒక వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష, ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిం దని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 18 మందిని కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఆరుగురికి జైలు శిక్ష,మొత్తం10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 12 మందికి 18,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

● ఈవో కృష్ణప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ, మార్చి27: రాజరాజేశ్వర క్షేత్రంలో శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం నిర్వహించనున్న శ్రీస్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి దివ్యకల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివస్తున్న విషయం దృష్టిలో ఉంచుకుని విశాలమైన వేదికను ఏర్పాటు చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వీలుగా భారీ స్ర్కీన్లు అమర్చామన్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా క్యూలైన్లు క్రమబద్ధీకరించామని అన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు కోడెమొక్కులు మినహా అన్ని రకాల ఆర్జిత సేవలు నిలిపివేశామని అన్నారు.

రాజన్నక్షేత్రంలో వైభవంగా శివకల్యాణోత్సవాలు

● స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ● నేడు పార్వతీరాజరాజేశ్వరస్వామివారి కల్యాణం



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ధర్మగుండంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి27: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివకల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు ఉదయం 8-05 గంటలకు శివ భగవత్పుణ్యాహవచనము గావించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారి కళ్యాణ మంటపంలో ఆచార్య దంపతులు దంపతులకు, అర్చకస్వాములకు, వేదపండితులకు ఆలయ ఈఓ కృష్ణప్రసాద్ వరుణీ అందజేశారు. అనంతరం అర్చకులు పంచగవ్య మిశ్రణము, దీక్షాధారణము, మంటప ప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠ, గౌరీ షోడశ మాతృకా ప్రతిష్ఠ, మృత్సంగ్రహణము, అంకురార్పణము, వాస్తు ప్రతిష్ఠ, సోమకుంభ కలశ ప్రతిష్ఠ, వాస్తుహోమము, కుండ సంస్కారం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు ఉదయం మహామండపంలో శ్రీరాజరాజేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించగా, వేదపండితులు వేదపారాయణం గావించి, పరివార దేవతార్చనలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీస్వామివారి కల్యాణమంటపంలో శివపురాణ ప్రవచణం చేవారు. రాత్రి భేరీ పూజ, దేవతాహ్వానము నిర్వహించారు. శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి దివ్యకల్యాణోత్సవం 28వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. కల్యాణానికి వేములవాడ దివ్యక్షేత్రం అందంగా ముస్తాబైంది. ఆలయ ఛైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉ. 10-50 గంటల నుంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారల దివ్యకల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం శివ పురాణ ప్రవచనం, ప్రధాన హోమము, సప్తపది నిర్వహిస్తారు. శివకళ్యాణోత్సవానికి భక్తులు, శివపార్వతులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ మేరకు భక్తులు శ్రీస్వామివారి కల్యాణం వీక్షించడానికి ఆలయ ప్రాంగణంలో స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. శివకల్యాణోత్సవాల సందర్భంగా కోడెమొక్కుతో పాటు ఐదు రోజుల పాటు అభిషేకం, అన్నపూజ తదితర అన్నిరకాల ఆర్జిత సేవలను నిలిపివేశారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

రాజరాజేశ్వర క్షేత్రంలో శివకల్యాణోత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ అంజయ్య పరిశీలించారు. ఎద్ద సంఖ్యలో భక్తులు, శివపార్వతులు తరలివస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా లక్ష్మీనృసింహుని ఉత్తర దిగ్యాత్ర



లక్ష్మీ నృసింహ స్వామి వారల ఊరేగింపు సేవ



ఉసిరిక వాగు సమీపంలో లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

- ఉసిరిక వాగు వద్ద పూజలు అందుకున్న నారసింహుడు

ధర్మపురి, మార్చి 27: ధర్మపురి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో సేవలపై ఆశీనులు చేశారు. పుర వీధుల గుండా ఉత్తర దిగ్యాత్ర కోసం ఉసిరిక వాగు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద స్వామివారల సేవలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. దారిపొడవుగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రాత్రి వేళలో స్వామి వారల సేవలు తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణయ్య ఆధ్వర్యంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, నవీన్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి దేవస్థానం ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు రాపర్తి సాయికిరణ్, మాదాసు మల్లేష్, నేదునూర్ శ్రీధర్, కొమెరెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్ దంపతులు, ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌శర్మ, తిరుపతి, రమేష్, మామిడివాడ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరికి జైలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: పికప్ వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వాహన డ్రైవర్ ఆలకుంట రాజు, యాజమాని ఆలకుంట శేఖర్‌లను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 15 రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఏఎస్‌ఐ కిషన్‌రావు బుధవారం తెలిపారు. ఈ నెల 26న స్టేషన్ హౌజ్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని కానిస్టేబుళ్లు సతీష్, మహేందర్, శ్రీకాంత్‌లు అక్కపల్లి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో వీరు ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. విచారణ జరిపి గతంలోనూ ఇద్దరిపై కేసులు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సిరిసిల్ల కోర్టులో హాజరు పర్చామని పేర్కొన్నారు. న్యాయమూర్తి ఆలకుంట రాజు, ఆలకుంట శేఖర్‌లకు 15 రోజుల జైలు విధించారని ఏఎస్‌ఐ కిషన్‌రావు వివరించారు.

ఇంటర్ బీసీ విద్యార్థుల ఫీజు ప్రభుత్వం భరించాలి

గణేశ్‌నగర్, మార్చి27: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ చదివే బీసీ విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం నిర్ణయించి రీయింబర్స్ రూపంలో విద్యార్థులకు అందజేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసు పెద్ది శ్రీధర్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజులు అందజేస్తామని ప్రకటించిందన్నారు.

అదృశ్యమైన విద్యార్థి మృతి

● 27రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు



అభిలాష్(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి27: స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఈ నెల 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27రోజుల తరువాత ఓ వ్యవసాయ బావిలో అతని మృతదేశం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యులు, సీఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, దామరకుంట గ్రామానికి చెందిన ఎనగంటి శ్రీనివాస్ రజిత దంపతులకు ఇద్దరు కుమా రులు. పెద్ద కుమారుడు ఎనగంటి అభిలాష్ (26) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉండి డిప్లొమా చదువుతున్నాడు. మార్చి ఒకటో తేదీన కళాశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అభిలాష్ తిరిగి కళాశాలకు చేరుకోలేదు. ఈ విషయం అతని తండ్రికి కళాశాల వార్డెన్ సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు స్థానికంగా ఎల్‌ఎండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఓ వివాహితను కాపాడే ప్రయత్నంలో విద్యార్థి మృతదేహం గుర్తింపు

అలుగునూర్‌కి చెందిన ఓ వివాహిత ఇంట్లో వేధిస్తున్నారని తాను బావిలో పడి చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు 100నెంబరుకు సమాచారం అందించారు. ఎల్‌ఎండీ పోలీసుల సహకారంతో తిమ్మాపూర్ స్టేజీకి సమీపంలో వ్యవసాయ బావుల వద్ద వివాహిత కోసం వెతికారు. ఆ సమయంలో ఓ వ్యవసాయ బావిలో విద్యార్థి అభిలాష్ మృతదేహంను గుర్తించారు. సంఘటన స్థలానికి తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్‌ఎండి ఎస్సై చేరాలు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి అభిలాష్ మృతదేహంగా నిర్ధారించారు. అతని తండ్రికి సమాచారం అందించి పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని అభిలాష్ తండ్రి శ్రీనివాస్‌కు అప్పగించారు. తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందని అభిలాష్ తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో వైపు మహిళను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న హరీష్‌రావు

● ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు ఎండిపోకుండా చర్యలు చేపడుతుంటే రైతులు ఆందోళన చెందేలా మాజీ మంత్రి హరీష్‌రావు వాస్తవాలను వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం ఎమ్మెల్సీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రబీ పంటల సాగు నీటి సమస్యలపై బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడం విస్మయం కలిగిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రబీ పంటకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించకుండా ఎస్సారెస్పీలో ఉన్న నీటిని తరలించడంతో సాగు నీటి సమస్య తలెత్తిందన్నారు. 2023 సంవత్సరం జనవరితో పోల్చితే 2024 జనవరిలో 10 నుంచి 20 మిలియన్ల విద్యుత్ అధికంగా వినియోగం పెరిగిందనే విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తెలుసుకుని విద్యుత్‌పై మాట్లాడాలని హితవు పలికారు. గత ప్రభుత్వం దీర్ఘకాలిక రుణాల అప్పులపై వడ్డీ రాయితీ పూర్తిగా ఎత్తి వేపిందని, పంటల బీమా పథకానికి నిధులు చెల్లించలేక పథకాన్నే ఎత్తివేశారని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడైనా పంట నష్టపరిహారం చెల్లించారా అని హరీష్‌రావును ప్రశ్నించారు. పంట రుణాలకు సంబంధించి రైతులపై ఎటువంటి చర్యలు చేపట్టవద్దని, ప్రభుత్వమే రుణాలు చెల్లించేలా బాధ్యత వహించేలా బ్యాంకర్లతో పాటు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతుందన్నారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని పంట ఎంత నష్టపోతే అంత పరిహారం ఇస్తామని ఈ విషయంలో సీఎం ఇదివరకే జిల్లా కలెక్టర్లుకు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గోవర్ధన్‌కు చక్కెర ఫ్యాక్టరీ ఎప్పుడు ప్రారంభించారో, ఎవరి హయాంలో మూత పడిందో, దీనిని ఎవరు కొనుగోలు చేశారో అనే విషయాలు తెలువకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జగిత్యాల ప్రాంతానికి కవిత ఎంపీగా ఉన్న సమయంలోనే చక్కెర ఫ్యాక్టరీ పూర్తవగా మూతపడిన విషయం రైతులకు తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని మెనిఫెస్టోలో పెట్టామన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చేలా పునఃప్రారంభించే చర్యల్లో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసిందని వివరించారు. చక్కెర ఫ్యాకరీని పుఃనప్రారంభం చేయించే బాధ్యత నాదేనని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు గుంటి జగదీశ్వర్, గాజుల రాజేందర్, చాంద్ పాషా, శంకర్, అంజయ్య, మహేష్, మహిపాల్, వసంత్ రావు, రజనీకాంత్, విజయ్, మీర్‌ఖాజీం అలీ తదితరులు ఉన్నారు.



కొండగట్టులో హుండీ లెక్కిస్తున్న భక్తులు

అంజన్న హుండీ ఆదాయం రూ.1.11కోట్లు

మల్యాల, మార్చి 27: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. 48 రోజులకు ఈ హుండీల ద్వారా రూ.1,11,07,329 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 74 గ్రాముల మిశ్రమ బంగారం, 5.500కిలోల మిశ్రమ వెండి, 40 విదేశి కరెన్సీ లభించినట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ దేవాదాయ శాఖ డీసీ జి సంజీవరెడ్డి పరిశీలకులుగా పాల్గొనగా ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి తదితరులు ఈ లెక్కింపులో ఉన్నారు.

1300 కేజీల పేలుడు పదార్థాల పట్టివేత

● ఇద్దరి అరెస్టు, వాహనం సీజ్



పేలుడు పదార్థాలను చూపిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 27: జిల్లాలో పేలుడు పదార్థాలను అక్రమ రవాణా చేస్తే ఊరుకోమని, అలాంటి వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మరిపెడ మండలం వీరారం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జగిత్యాల జిల్లా నుంచి మరిపెడకు వస్తున్న ఓ బోలెరో ట్రాలీ వాహనం పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారని, దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ వాహనంను తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట చెందిన కస్తూరి కుమార్, కస్తూరి సారయ్య, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంటకుంట తండాకు చెందిన దరావత్ కిశోర్ కలిసి బోలెరో ట్రాలీలో 50 ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్, 32 బాక్సులలో జిలెటిన్‌జిక్స్ పవర్ మొత్తం 6400, 20 బాక్సుల్లో జిలెటిన్ స్టిక్స్ పవర్ బూస్టర్‌లు 180, మొత్తం పేలుడు పదార్థాలు 1300 కేజీలను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన ట్రాలీ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కస్తూరి కుమార్ తండ్రి సారయ్య పేరుమీద వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ తెలంగాణ జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం జగదేవ్‌పేట పేరుపై లైసెన్స్ తీసుకుని లైసెన్స్ ప్రకారం కేవలం నిర్ణీత పరిధిలో మాత్రమే పేలుడు పదార్థాలను అమ్ముకోవాల్సి ఉందన్నారు. కానీ, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతోనే అక్రమంగా పేలుడు పదార్థాలను అనుమతి లేనివారికి విక్రయిస్తూ పట్టుబడ్డారని, ఈ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ప్రస్తుతం కస్తూరి సారయ్య పరారీలో ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని తెలిపారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య నేతృత్వంలో ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన మరిపెడ సీఐ హత్తిరాం, ఎస్సై తహేర్‌బాబా, సిబ్బంది ఉన్నారు.

దొంగల అరెస్టు

● నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మార్చి 27: జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు వ్యక్తులతో పాటు ఒక మైనర్ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా బుధవారం కరీంనగర్ రూరల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ రవిందర్‌లు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ కృష్ణలంకకు చెందిన బోజ్జ మనోజ్ కుమార్ కొంతకాలంగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో నివాసం ఉంటూ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులైన హైదరాబాద్ బోయినిపల్లికి చెందిన బందెల సుమిత్, విజయవాడకు చెందిన ఎల్ల సత్య ఆంజనేయులుతో పాటు బాలుడు జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోనందున ఒక ముఠాగా ఏర్పడి బైక్‌లు దొంగిలిస్తున్నారు. నలుగురు కలిసి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో నాలుగు బైక్‌లను చోరీ చేశారు. యమహా(టీఎస్ 22 హెచ్ 6478), పల్సర్(టీఎస్ 02 ఈఆర్ 7196), పల్సర్(టీఎస్ 25 ఎఫ్ 7024), (టీఎస్ 04 ఇజి 3006)లను ఈ ముఠా చోరీ చేసింది. ఈ బైక్‌లలో ఒకటి హైదరాబాద్‌కు తరలించిన నిందితులు మిగతా మూడు బైక్‌లను కూడా తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నలుగురు నిందితులపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, ఎల్ఎండీ ఠాణాలలో కేసులు నమోదు చేశారు.

భర్త చేతిలో భార్య హతం

● నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

పెద్దపల్లిటౌన్/ఎండపల్లి మార్చి 27: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన రజిత(35) భర్త చేతిలో మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురైంది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తన కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన యాళ్ల పున్నంరెడ్డికి అదే మండంలం నర్సింగాపూర్‌కు చెందిన రజితతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. పున్నంరెడ్డి చెడు అలవాట్లకు బానిసై తరుచూ భార్యతో గొడవపడేవాడు. ఈ విషయమై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. మద్యం మానేసి కొనాళ్లు సజావుగా ఉన్న పున్నంరెడ్డి రెండు నెలల క్రితం నుంచి మళ్లీ తాగుడు మొదలు పెట్టాడు. దీంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఇదే క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన భర్తను మళ్లీ ఎందుకు తాగుతున్నావని భార్య ప్రశ్నించింది. మద్యం మత్తులో ఉన్న పున్నంరెడ్డి కోపోద్రికుడై రజితను చేతికందిన ఇనుప వస్తువుతో తలపై బలంగా బాదడంతో రజిత అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు రజిత తల్లి వజ్రవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ మొదలుపెట్టారు. నిందితుడు పున్నంరెడ్డిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చనవున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పెద్దపల్లి సీఐ రాసూరి క్రిష్ణ, బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి పాల్గొన్నారు.

జగిత్యాలలో ఒకరి ఆత్మహత్యాయ్నం

జగిత్యాల టౌన్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో బుధవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములుగు జిల్లా నూజివీడు గ్రామానికి చెందిన మణి కుమార్ సతీమణి జగిత్యాలలోని చిల్డ్రన్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. కొన్ని రోజులుగా వారికి కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. బుధవారం జగిత్యాలకు చేరుకున్న మణికుమార్ తన భార్యతో గొడవకు దిగాడు. తీవ్ర మనస్థాపానికి గురైన మణికుమార్ చేతిలో పురుగుల మందు డబ్బాను పట్టుకుని స్థానిక గొల్లపల్లి రోడ్‌లో కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొంటూ డయల్ 100కు సమాచారం అందించాడు. తక్షణమే స్పందించిన బ్లూ కోల్ట్స్ పోలీస్ జుబేర్ సంఘటనా స్థలానికి చేరుకుని పురుగుల మందు డబ్బాను లాక్కుని రక్షించాడు. అనంతరం చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ములుగు జిల్లాలోని వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

కేబుల్ బ్రిడ్జిపై పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

● యువతి కారణమంటూ సూసైడ్ నోట్



రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 27: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి(28) కరీంనగర్ శివారులోని కేబుల్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ఒక యువతి కారణమంటూ మృతుడి వద్ద ఒక సూసైడ్‌నోట్ లభించిందని ఒకటో ఠాణా ఎస్‌ఐ స్వామి తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి కరీంనగర్ మంకమ్మతోటలో ఒక అద్దె గదిలో నివాసం ఉంటూ తెలంగాణ చౌక్ సమీపం లోని ఒక మెస్ అండ్ రెస్టారెంట్‌లో 6 సంవత్సరాలుగా క్యాషియర్‌గా పనిచేస్తు న్నాడు. అతడికి ఏడాదిన్నర కిందట ఒక యువతి పరిచయం అయింది. ఇద్దరూ తరచుగా కలిసేవారు. ఇటీవల రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అతడికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతి తననే వివాహం చేసుకోవాలని, లేకుంటే ఇద్దరు కలిసిన ఫొటోలు, మాటల వాయిస్ రికార్డులు బయట పెడతానంటూ రాజశేఖన్‌రెడ్డిని బ్లాక్‌మెయిల్ చేస్తూ కొన్ని డబ్బులు కూడా తీసుకుంది. ఈ నెల 23న ఆ యువతితో పాటు మరికొందరు రాజశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి గ్రామపంచాయతీ వద్ద గొడవ చేయగా గ్రామస్థులు సర్ది చెప్పి పంపించారు. రాజశేఖర్‌రెడ్డి తన కుటుంబ పరువు పోతుందని మనస్థాపంతో మంగళవారం ఉదయం కేబుల్‌బ్రిడ్జిపై పురుగుల మందుతాగి తన స్నేహితుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి మరణించాడని తెలిపారు. తన కొడుకు రాజశేఖర్‌రెడ్డి ఆత్మహ త్యకు యువతి, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులే కారణమంటూ మృతుడి తండ్రి దూది రఘుపతిరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతితో పాటు ఆమె కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ఎస్‌యూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్



ఎస్‌యూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

గణేశ్‌నగర్, మార్చి27: శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు అపూర్వ స్పందన వచ్చినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ మనోహర్ తెలియజేశారు. ఆక్సిస్ బ్యాంక్, యాక్సెంచర్, పతంజలి సంస్థలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయని తెలిపారు. దీనికి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో యాక్సిస్ బ్యాంక్‌కు పదిమంది, యాక్సెంచర్‌కు ఆరుగురు, పతంజలిలో 13మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 31 మంది ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ ఈ మనోహర్ తెలియజేశారు.

పొలాసలో వ్యవసాయ పరిశోధనలపై సమావేశాలు



హాజరైన అధికారులు, రైతులు

జగిత్యాలరూరల్, మార్చి 27: ఉత్తర తెలం గాణ మండల వ్యవ సాయ పరిశోధన విస్తరణ సలహా సంఘ వానాకాలం- యాసంగి పంటలకు సంబంధించిన సమావేశాలు జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం ప్రారంభం అయ్యాయి. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు సుదారాణి, జ్యోతి ప్రజ్వలనచేసి సమా వేశాన్ని ప్రారం భించారు. పొలాస పరిశోధన కేంద్రంలో గత సంవత్సరంలో జరిగిన పరిశోధన ఫలితాలను డాక్టర్ శ్రీనివాస్ రైతులకు వివరించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజులత గత సంవత్సరంలో సలహా సంఘంలోని రైతుల సందే హాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తర తెలంగాణ జిల్లాల వ్యవ సాయ అధికారులు వారి జిల్లాల్లో ఉన్న పంటలు, ఆ పంటలలోని సమస్యలను, ఇబ్బందులను, ఫలితాలను ప్రజెంటేషన్ రూపంలో తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

ధర్మారం, మార్చి 27: మండలంలోని నందిమేడారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం అత్తె రాజారాం, ఉపాధ్యాయురాలు శ్రీదేవి, అనిత, ఆర్‌బీఎస్‌కె వైద్యులు యాదగిరి, శ్రావణ్‌కుమార్, సంజప, పాల్గొన్నారు.

నేడు హుండీల లెక్కింపు

మంథని, మార్చి 27: మంథనిలోని మూడు ప్రముఖ ఆలయాల్లో హుండీలను గురువారం లెక్కించనున్నట్లు ఎండోమెంట్ మేనేజర్ రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. స్థానిక శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో హుండీని ఉదయం 10:30గంటలకు, శ్రీమహాలక్ష్మి దేవాలయం హుండీని మధ్యాహ్నం 12:30 గంటలకు, శ్రీ గౌతమేశ్వర స్వామి దేవస్థానం హుండీని మధ్యాహ్నం 3:30 గంటలకు లెక్కించనున్నట్లు, భక్తులకు హాజరుకావాలని కోరారు.

మహిళలకు శిక్షణ

మంథని, మార్చి 27: మహిళా సాధికారతలో భాగంగా స్థానిక గౌతమి మండల సమాఖ్య ఆఫీసులో బుధవారం పలు అంశాలపై మహిళలకు ఉపాధి శిక్షణ కల్పించారు. క్లాత్ కటింగ్, డిజిటల్ ఫైనాన్సియల్ లిటరసీ, సైబర్ సెక్యూరిటీ, లింగ సమానత్వం అవగాహన కల్పించారు. అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ

ధర్మారం, మార్చి 27: మండలంలోని సాయంపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని నియమించారు. కన్వీనర్‌గా హెచ్‌ఎం జాడి శ్రీనివాస్, చైర్‌పర్సన్‌గా నరిగే ప్రమీలతో పాటు ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను నియమించారు. నూతనంగా నియామకమైన నరిగే ప్రమీలను ఉపాధ్యాయులు సన్మానించారు.

మట్టి టిప్పర్‌లను అడ్డుకున్న గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, మార్చి 27 : మండలంలోని తుర్కల మద్దికుంటలో మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను అడ్డుకున్నారు. గ్రామంలోని గుట్ట నుంచి అనుమతులు తీసుకొని మట్టిని తరలిస్తున్నా గ్రామ అవసరాల కోసం మట్టి పోయాలని పలువురు గ్రామస్థులు అడుగగా పోయకపోవడంతో అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామ అవసరాలకు సహకరించకుండా మట్టిని తరలించుకుపోతున్నారని పలువురు తెలిపారు.

రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం

పెద్దపల్లిటౌన్, మార్చి 27: పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు. ఎన్నికల అధికారి, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు హనుమంతు నూతన జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా సాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కేతిపెల్లి మహేందర్‌రెడ్డి, టి.రామస్వామి, ప్రధానకార్యదర్శిగా వేగోళం సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా కర్రె ప్రవీణ్, మీడియా కన్వీనరుగా ఎలుగం కనకయ్య, ముఖ్య సలహాదారుగా చాట్ల ఆగయ్య ఎన్నికయ్యారు.

ఢిల్లీకి తరలిన మాదిగశక్తి నేతలు

పెద్దపల్లిటౌన్, మార్చి 27: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ పార్టీ పునరాలోచన చేయాలని, మాదిగకే పార్లమెంట్ టికెట్టు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీ కార్యాలయానికి మాదిగశక్తి నేతలు తరలివెళ్లారు. మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్ని మాట్లాడుతూ మాదిగ దండోరా, మాదిగ జేఏసీ, మాదిగశక్తి ఆధ్వర్యంలో జిల్లా నుండి రెండువందల మంది నాయకులు, మహిళలు తరలివెళ్తున్నట్లు తెలిపారు.

ఉగాది పురస్కారానికి ఎంపిక

ముత్తారం మార్చి 27: మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన ఒగ్గుకథ కళాకారుడు నర్ర సతీష్ యాదవ్ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలో దేవా కళా బృందం ఆధ్వర్యంలో సంగీతం, సాహిత్యం, నృత్యం మరిన్ని కళరంగాలలో పేరు పొందినవారికి ఉగాది పురస్కారం పేరుతో సన్మానిస్తున్న సందర్భంగా ఒగ్గు కథ కళాకారుడు సతీష్ బిట్వీన్ డ్యాన్స్ అకాడమీ గ్రాండ్‌మాస్టర్ పులిపాక దేవా ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో అవార్డు అందుకోనున్నారు.

బీఎస్‌పీ రామగుండం ఇన్‌చార్జీగా కనకయ్య

కోల్‌సిటీటౌన్, మార్చి 27: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఎన్‌టీపీసీకి చెందిన ఇరికిల్ల కనకయ్య నియమితులయ్యారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇరికిల్ల రాజనర్సయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ సమక్షంలో కనకయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిక అనంతరం కనకయ్యను పార్టీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీగా ప్రకటించారు.

ఎల్వోసీ అందజేత

పెద్దపల్లి రూరల్, మార్చి 27 : మండలంలోని గోపయ్యపల్లికి చెందిన ఎంసాని నితీష్ కిడ్నీ, లివర్ వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును కోరగా బాధిత కుటుంబానికి రూ.2లక్షల ఎల్వోసీ ఇప్పించారు. బాధిత కుటుంబానికి బుధవారంనాయకులు హైదరాబాద్‌లో చెక్కును అందించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

సుల్తానాబాద్, మార్చి 27: సుల్తానాబాద్ పట్టణంలో ఓ లారీ డ్రైవర్ అప్రమత్తత వల్ల పెద్ద ప్రమాదం తప్పి ప్రాణ నష్టం త్రుటిలో తప్పిపోయింది. కాగజ్ నగర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ బయలుదేరగా సుల్తానాబాద్ పట్టణంలో ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూల మలుపు వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. కారు వెనకాలే వస్తున్న లారీ డ్రైవర్ అప్రమత్తమై లారీని మరోవైపు మళ్లించాడు. దాంతో పెద్ద ప్రమాదం తప్పింది.

గుడుంబా పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 27: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేకే నగర్‌లో బుధవారం రాత్రి పోలీసులు గుండుంబాని పట్టుకున్నారు. కేకే నగర్‌లో గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు రాత్రి బూక్య భీమ్లా నాయక్ అనే వ్యక్తి ఇంటిని సీఐ బీ రవీందర్ సిబ్బందితో కలిసి తనిఖీచేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 5 లీటర్ల గుండుంబా దొరికింది.

రౌడీషీటర్లు క్రైమ్ స్టాపర్లుగా పనిచేయాలి

- సత్ప్రవర్తన కలిగిన వారి షీట్లు ఎత్తివేస్తాం - రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 27: రౌడీ షీటర్లు క్రైమ్ మేకర్లుగా క్రైమ్ స్టాపర్స్‌గా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పెద్దపల్లి జిల్లాలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ మానవీయ కోణంలో ఆలోచించి మార్పు కోసం ఒక అవకాశం ఇస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొందరపాటుతో నేరాలు చేసినా దాని ప్రభావం కుటుంబాలపై పడుతుందని, కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. రౌడీ షీటర్ అనే ఒక పదం పిల్లల భవిష్యత్‌కు కూడా ప్రతిబంధకంగా మారుతుందన్నారు. పిల్లలకు మంచి తల్లిదండ్రులుగా ఉండాలని, వారిని బాగా చదివించి బంగారు భవిష్యత్ ఇవ్వాలన్నారు. రౌడీషీటర్లు ఇకనుంచి క్రైమ్ మేకర్లుగా కాకుండా క్రైమ్ స్టాపర్స్‌గా ఉండాలన్నారు. నేరం జరుగుతుందని తెలిసినా, అలాంటి పరిస్థితులున్నా వాటిని పోలీసుల దృష్టికి తీసుకువచ్చి అడ్డుకోవలన్నారు. రౌడీషీటర్లు భూకబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తులు ధ్వంసం వంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రతి కదిలకపై నిఘా పెట్టామని, సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. నేర ప్రవృత్తిని మార్చుకునేందుకు ఒక అవకాశం ఇస్తున్నామని, మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. పదేళ్లుగా ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తన కలిగి ఉన్న రౌడీ షీటర్లపై ఉన్న షీట్లను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీపీ శ్రీనివాస్

మావోయిస్టుల కట్టడికి పకడ్బందీ చర్యలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కట్టడికి పకడ్బందీ చర్యలు చేపట్టామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. మావోయిస్టు ప్రభావిత పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘా పెట్టామని, ఇన్‌ఫార్మర్ల వ్యవస్థను పటిష్టపర్చామన్నారు. ప్రాణహిత సరిహద్దు ఫెర్రీపాయింట్‌లలో తాను పర్యటించానని, మావోయిస్టులకు సహకరించవద్దంటూ జాలర్లకు సూచించమన్నారు. ముమ్మరంగా కూంబింగ్ జరుపుతున్నామని, కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు కూడా జరుగుతున్నాయన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గడ్చిరోలి సరిహద్దు ఉందని, ఈ జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు ఉన్నాయన్నారు. మహారాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులతో ఎన్‌టీపీసీ, గడ్చిరోలిలో సమావేశాలు జరిగాయని, ఈ సమావేశాల్లో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నామన్నారు. సమాచార మార్పిడితో ఆ ప్రాంతంలో ఎన్‌కౌంటర్లు కూడా జరుగుతున్నట్టు సీపీ తెలిపారు. ఈ ప్రాంతానికి రెండు దళాలు మహారాష్ట్రలో స్తబ్దంగా ఉండిపోయాయన్నారు. అయినా కూడా సమస్యాత్మక పోలీస్ స్టేషన్లు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకనిఘా పెట్టామన్నారు. రామన్‌పల్లి వద్ద అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు, 21అంతర్‌జిల్లాల సరిహద్దుల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రెండు కంపెనీల కేంద్రబలగాలను తెప్పించామని, పెద్దపల్లికి సీఆర్‌పీఎఫ్, మంచిర్యాలకు సీఏపీఎఫ్‌ను కేటాయించామన్నారు. సర్వేలైన్స్ స్టాటికల్ టీమ్స్‌తో సీఏపీఎఫ్ దళాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటికే కేంద్ర బలగాలతో పట్టణాలు, గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపినట్టు తెలిపారు. పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు సమానంగా చేపట్టాలి

పెద్దపల్లి టౌన్, మార్చి 27 : పెద్దపల్లి పట్టణం రాజీవ్ రహదారి చీకురాయి క్రాస్ రోడ్డు నుంచి రంగంపల్లి శివారు వరకు రోడ్డు వెడల్పును ఇరువైపులా సమానంగా చేపట్టడం లేదని స్థానికులు ఆందోళన నిర్వహించారు. రోడ్డు వెడల్పు చేసి డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. 60 అడుగుల వెడల్పుతో ఈరోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారని, ఇరువైపులా సమానంగా రోడ్డు వెడల్పు చేయడం లేదని నిర్మాణ పనులు జరుగుతుండగా బీఆర్‌ఎస్ నాయకుడు పడాల సతీష్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 అడుగుల వెడల్పు గల రోడ్డును ప్రధాన రహదారి ఆరంభం నుంచి కుడి వైపునకు 15 అడుగుల వెడల్పు చేసి, ఎడమ పక్కన 30 అడుగుల వెడల్పు చేస్తున్నారని ఆరోపించారు. 200 మీటర్ల దూరం వరకు రోడ్డు తక్కువ వెడల్పు తీస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఫోన్‌లో మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుక వెళ్లినా కూడా రోడ్డును పరిశీలించలేదని తెలిపారు. తక్షణమే ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి ఇరువైపులా రోడ్డు వెడల్పు సమానంగా తీయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌ను వివరణ కోరగా గురువారం రోడ్డు పనులను పరిశీలించి చర్యలు చేపడతామని అన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, మార్చి 27: మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన వెల్తురు మణెమ్మ గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆసుపత్రికి వెళ్లలేక మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి కడుపునొప్పి రావడంతో తన ఇంటిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మణెమ్మను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృత్యువాత పడింది. మణెమ్మకు కుమారుడు ఉపేందర్ ఉన్నాడు. మణెమ్మ మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్‌యాదవ్ తెలిపారు.

సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి, ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



భోజన్నపేటలో వరి పంటను పరిశీలిస్తున్న కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్

పెద్దపల్లి రూరల్, మార్చి 27 : రైతులకు సాగు నీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామంలోని భోజన్నపేట శివారులో ఎండిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పరిపాలించిన కాలంలో ఒక్క ఎకరం కూడా పంట ఎండిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మండల పార్టీ అధ్యక్షుడు మార్క లక్ష్మణ్, బాలసాని ఈశ్వర్, మాజీ సర్పంచ్‌లు తీగల సదయ్య, ఆవుల కిషన్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు మేకల కుమార్, సలెంద్ర రాములు,కిట్టు, ధర్మపురి, ఉప్పు రాజ్‌కుమార్, పుదరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంపులలో ముమ్మరంగా తనిఖీలు

ఓదెల, మార్చి 27 : మండల సరిహద్దు గ్రామమైన గుంపులలో బుధవారం పోలీస్, రెవెన్యూ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పార్లమెంట్ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం, డబ్బు పంపిణీ అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపడుతున్నారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల నుంచి జమ్మికుంటకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనాలను తనిఖీ చేస్తూ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. డబ్బు, బంగారానికి సంబంధించిన సరైనా కాగితాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారి యాకయ్య, డిప్యూటీ తహసీల్దార్ యాకయ్య, ఆర్‌ఐ రాజేందర్ పాల్గొన్నారు.

ఆసుపత్రికి వాటర్ ఫిల్టర్ బహూకరణ



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న గుర్రాల శ్రీధర్

కళ్యాణ్‌నగర్, మార్చి 27: గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రికి అంజనీ పుత్ర డెవలపర్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ బుధవారం రూ.50వేల విలువైన ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ రోగుల సౌకర్యార్థం బహూకరించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్‌ఎంవో అప్పారావు, రేణుక, అంజనీ పుత్ర డైరెక్టర్లు పిల్లి రవి, కిషన్ సంతోష్, సదానందం, తిరుపతి, వెంకన్న, ప్రవీణ్, శ్రీనివాస్, సురేష్, కిరణ్, శ్రీధర్, కుమార్, లక్ష్మి, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు

పెద్దపల్లి రూరల్, మార్చి 27 : మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌లలో ఏర్పాటుచేసిన హద్దు రాళ్లను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. గత కొన్నాళ్లుగా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి లే అవుట్ లేకపోవడంతో ప్రభుత్వ అనుమతులు లేకుండా హద్దు రాళ్లను పాతగా 'నాటి పంట పొలాలే... నేటి వెంచర్‌లు' అనే కథనం మంగళవారం ప్రచురితమైంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశాల మేరకు మండలంలోని గౌరెడ్డిపేటలోని అక్రమ వెంచర్‌లో పంచాయితి కార్యదర్శి ప్రకాష్ హద్దురాళ్లను తొలగించారు. అలాగే వెంచర్ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సిబ్బంది ఉన్నారు. దీనిపై ఎంపీవో సుదర్శన్‌ను వివరణగా కోరగా అనుమతులు లేకుండా వెంచర్‌లు ఏర్పాటు



ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చేయవద్దని, ఒకవేళ ఏర్పాటు చేసిన తరువాత కొనుగోలు చేసిన ఇళ్ల అనుమతులు రావని పేర్కొన్నారు. అలాగే రాఘవపూర్‌లోని అక్రమ వెంచర్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీవో సుదర్శన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తన సిబ్బందితో హద్దురాళ్లను తొలగించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

సుల్తానాబాద్, మార్చి 27: కేంద్ర ప్రభుత్వ పథకాలను, ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాల గురించి ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేసి బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ గెలుపునకు కృషి చేయాలని బీజేపీ పెద్దపల్లి అసెంబ్లీ ప్రభారి ఆరుముళ్ల పోషం పిలుపునిచ్చారు. బుధవారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శక్తి కేంద్రం, బూత్ కమిటీల అధ్యక్షులు వారివారి బూత్‌ల్లో ప్రతి ఓటరుకు కేంద్ర ప్రభుత్వ పాలన గురించి, పథకాల అమలు గురించి, తెలియజేయాలని సూచించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించి దేశంలో మూడోసారి నరేంద్రమోదీని ప్రధానిగా చేయాలని అన్నారు. ఎన్నికలలో వ్యవహరించే పలు అంశాల గురించి ఆయన కార్యకర్తలకు సలహాలు సూచనలు అందజేశారు. శక్తి కేంద్రాల ఇంచార్జిలుగా గజబీంకార్ పవన్, తిరుపతి, వల్స సాయి కిరణ్, బుర్ర సతీష్‌లను నియమించారు.

ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల వనజ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, పార్లమెంట్ విస్తరక్ స్వామి, దళిత మోర్చా ఉపాధ్యక్షుడు ఈర్ల శంకర్, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, చంద్రకళ, మాటూరి లత, ఈశ్వర్, మనోహర్, కుమార్, రమేష్, గెల్లు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిబాబు



మంథని, మార్చి 27: మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేవీఎల్ ఎన్ హరిబాబు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిబాబు ఎన్నిక కావడం ఇది పదోసారి. మంథని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కేతిరెడ్డి రఘోతంరెడ్డి, సహాయ కార్యదర్శిగా విజయ్ కుమార్, కోశాధికారిగా అంజనేయులు, లైబ్రరీ కార్యదర్శిగా ఆర్ల నాగరాజు, సాంస్కృతిక కార్యదర్శిగా కటకం శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

రామగిరి, మార్చి 27: రామగిరి మండలం లోంకకేసారం గ్రామానికి చెందిన నాంసాని లక్ష్మి-రాజయ్య కూతురు సుస్మిత వివాహనికి కల్వచర్ల సేవా సమితి బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. సుస్మిత తల్లిదండ్రులు మృతిచెందగా మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణరెడ్డి సేవా సమితి సహకారంతో సేకరించిన రూ.17వేల రూపాయలు, క్వింటాల్ బియ్యం యువతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెము కనకయ్య, ఒర్రే స్వరూప, సదయ్య,ఒజ్జ ఓదెలు, స్వరూప, సదయ్య, కొప్పుల సునీల్, పొట్యాల అంజిరాజు, కొయ్యడ పరుశురాం, మామిడి హరిష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, మార్చి27: మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారాముల, ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ ప్రజలను పాడి పంటలతో శుభిక్షంగా ఉండేలా చూడాలని శ్రీసీతారాముల, ఆంజనేయస్వాముల వారిని ఎమ్మెల్యే విజయరమణారావు వేడుకున్నారు. ఈ ఉత్సవాలను వేద బ్రాహ్మణులచే నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో విండోచైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, మాజీ విండో చైర్మన్ గందు సంజీవ్, మాజీ సర్పంచులు మేచినేని సంతోష్‌రావు, దారబోయిన నర్సింహాయాదవ్, ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, నాయకులు మల్లేశం, స్వామి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న చినజీయర్‌స్వామి

జ్యోతినగర్, మార్చి 27: భీమునిపట్నం చిలుకలయ్య ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయ చంద్రమౌళేశ్వర ఆలయంలో బుధవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో చినజీయర్ స్వామి పాల్గొన్నారు. అర్చకులు వేద మంత్రాల మధ్య యజ్ఞం నిర్వహించి, కలశ పూజ చేశారు. అనంతరం సీతారామాంజనేయ విగ్రహాలను చినజీయర్‌స్వామి ప్రతిష్ఠించారు. అనంతరం విగ్రహాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈపూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు చెప్యాల శ్రీరామారావు, కేశవరావు, శరత్‌రావు, సత్యనారాయణ, శ్రీపతిరావుతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

'నేతకాని సామాజిక వర్గానికి క్షమాపణ చెప్పాలి'

పెద్దపల్లిటౌన్, మార్చి 27: నేతకాని సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు గుమ్మడి కుమ్మరస్వామి వెంటనే క్షమాపణలు చెప్పాలని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గొల్లే రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ నేతకాని జాతికి నీతి, జాతి లేదంటూ తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా కాంగ్రెస్ నాయకుడు మాట్లాడటం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ జాతి సామాజిక ఉద్యమాలలో ముందు ఉందన్నారు. నేతకానికి స్వతహాగా సంస్కృతి, సంప్రదాయం ఉందని, అది తెలియని కుమారస్వామి పిచ్చిపిచ్చిగా మాట్లాడటం అతని అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో గ్రామ అధ్యక్షుడు పైడి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మంచినీళ్ల లింగయ్య, ముడి మడుగుల రాజేశం, మంచినీళ్ల బాబునాథ్, మంచినీళ్ల తిరుపతి, జాడి పోచయ్య, తాటుకూరి మధుకర్, జాడి ప్రవళిక, మంచినీళ్ళ అనిల్, మంచినీళ్ల శివలింగయ్య, మంచినీళ్ల లక్ష్మయ్య, మంచినీళ్ల రాజయ్య, మంచినీళ్ల తిరుపతి. చంద్రశేఖర్, మద్రాస్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి కళాశాలలో ఫేర్‌వెల్ డే



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 27: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులకు బుధవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. పట్టణంలో స్వరూప గార్డెన్‌లో నిర్వహించిన ఫేర్‌వెల్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్-రజనీలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇటీవల మారేడుగొండలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో పాల్గొన్న వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిందర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 27: మహిళలు పోషకాహారం తీసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, ఎమ్ఎల్ హెచ్‌పి డా.అభినయ్‌లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల నందు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, ఎమ్ఎల్‌హెచ్‌పి డా.అభినయ్‌లు మాట్లాడారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ ఎ.నరసింహా చారి, టిఒ దత్తాత్రి, డిపిహెచ్ఎన్ఓ, హెచ్ఈ మధుసూదన్, ఎస్ఓ సాలమ్మ, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 27: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్, రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం రాష్ట్ర కనీస వేతన సలహా మండలి కార్పొరేషన్ చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. కోల్‌మైన్స్ పెన్షన్-1998 సవరించి కనీస పెన్షన్ 15,000 చెల్లించేలా, ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించి కరువు భత్యంతో కూడిన పెన్షన్ వచ్చేలా దృష్టి సారించాలని దృష్టి సారించాలని కోరారు. సీపీఆర్‌ఎంఎస్ స్కీం కింద అపరిమిత వైద్య సదుపాయం అందించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్‌లను రిటైర్డ్ ఉద్యోగులకు కేటాయించడం, రాష్ట్ర ప్రభుత్వ వృద్ధాప్య పింఛన్ రిటైర్డ్ కార్మికులకు వర్తింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జనక్‌ప్రసాద్‌ని కోరారు. జనక్‌ప్రసాద్‌ని కలిసిన వారిలో సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసుదేవరావు, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్‌సీ రెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి వందార్ వేణుమాధవ్‌తో పాటు సభ్యులు ఉన్నారు.

ఓబీ కంపెనీపై ప్రభావిత గ్రామాల ప్రజల ఆగ్రహం

- స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 27: ఓసీపీ-3 ఓబీ కంపెనీ ఆర్‌వీఆర్‌పై బుధవారం ప్రభావిత గ్రామాల ప్రజలు గరమయ్యారు. మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సుందిళ్ల, సింగిరెడ్డిపల్లి, చందనాపూర్ తదితర గ్రామాల ప్రజలు, నిర్వాసితులు గోదావరిఖని విఠల్‌నగర్‌లోని ఆర్‌వీఆర్ ఫేస్-1 క్యాంపునకు వచ్చి నిరసన తెలిపారు. ఓబీ బ్లాస్టింగ్‌లతో తమ ఇండ్లు ధ్వంసం అవుతున్నాయని, మట్టి, బొగ్గు దూళితో పంటలు పండని పరిస్థితి ఉందన్నారు. తమ జీవితాలు నష్టపోతున్నామన్నారు. సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్టు ఔట్ సోర్సింగ్‌లో ప్రభావిత, నిర్వాసిత ప్రాంతాల వారికి ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చిందని, అయినా ఓసీపీ-3 ఆర్‌వీఆర్ కంపెనీ యాజమాన్యం పెడచెవిన పెట్టి ఇతర ప్రాంతాల వారిని తీసుకువచ్చి పని చేయిస్తోందని అన్నారు. సింగరేణితో తమ గ్రామాలే లేకుండా పోయాయని, వ్యవసాయ భూములు కంపెనీకి ఇచ్చామన్నారు. ఇప్పుడు ఉపాధి లేక రోడ్డున పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఓసీపీ-3 ఆర్‌వీఆర్ కంపెనీలో కంపెనీ సర్క్యులర్ ప్రకారం స్థానికులకు ఉపాధి ఇవ్వకపోతే పనులు



ఆర్‌వీఆర్ ఆఫీస్ ఎదుట బైఠాయించిన ప్రభావిత గ్రామాల ప్రజలు

అడ్డుకుంటామన్నారు. గోదావరిఖని టుటౌన్ పోలీసులు జోక్యం చేసుకుని ప్రజా ప్రతినిధులు, నిర్వాసితులతో చర్చించారు. ఒకటవ తేదిలోగా ఖాళీల జాబితా తయారు చేసుకుని స్థానికులకు ఉపాధి ఇచ్చేలా చర్యలు తీసు కుంటామన్నారు. ఈ ఆందోళనలో సుందిళ్ల ఎంపీటీసీ బుచ్చిబాబు, సుందిళ్ల మాజీ సర్పంచ్ మార్క రాములు, సింగిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఏలువాక ఓదెలు తదితరులు పాల్గొన్నారు.